క్లుప్తంగా

రాజకీయ వేధింపులు ఆపాలి



దీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ సుధాకర్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్, జయమ్మ, సరస్వతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, కడుపు కొట్టే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఇప్పటికే రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత డీఈఓపై ఉందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



కస్తూర్బా పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న తహసీల్దార్

గోస్పాడు: విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని తహసీల్దార్ భార్గవి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌లోని హాస్టళ్లను సోమవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కస్తూర్బాలో నీరు సక్రమంగా లేదని, దీంతో పాటు పాఠశాల పైకప్పు నుంచి నీరు లీకవుతుండగా, రెండు పాఠశాలల ఆవరణంలో నీరు నిలిచి ఇబ్బందిగా ఉన్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



క్రిష్టిపాడు ఎంపీపీయూపీ స్కూల్లో పుస్తకాలతో విద్యార్థులు

దొర్నిపాడు: మండలంలోని అన్ని పాఠశాల్లో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. ఇక నుంచి తరగతులు ప్రారంభించి విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను వెంటనే మొదటి తరగతికి చేర్చుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పెండింగ్ లేకుండా నిర్దేశించిన సమయం ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని కోరారు.

పోటా పోటీగా వేలం పాటలు



వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: యర్రగుంట్ల గ్రామంలోని శ్రీ రామ, ఈశ్వర, చెన్న కేశవస్వామి ఆలయాల మాన్యం కౌలుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటలు సోమవారం పోటా పోటీగా జరిగాయి. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రా రెడ్డి పర్యవేక్షణలో 69 ఎకరాలకు వేలం వేయగా భారీగా ఆదాయం పెరిగింది. గతేడాది రూ.9.55 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.17.76 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఈఓ నరసయ్య, ఎంపీటీసీ జయరామిరెడ్డి, మాజీ సర్పంచు కమతం పుల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు కమతం లక్ష్మీరెడ్డి, శీలం రాంమోహన్, ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసి, మూడు కోట్ల దేవతలు ముచ్చటించుకున్న ప్రాంతంగా ప్రసిద్ధికెక్కిన్న శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేప సాయం

వేప.. మానవాళికి ప్రకృతి ప్రసాదించిన దివ్య ఔషధం. ఈ చెట్టులోని ప్రతి భాగం ఔషధమయమే. వేప ఉత్పత్తులను పంటల సాగులో వినియోగిస్తే తెగుళ్ల తగ్గడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు వేప కషాయం, రసాలను కీటకాలు, వివిధ రకాల తెగుళ్ల నివారణకు పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా వాడి విజయవంతమయ్యారు. దీంతో ప్రస్తుతం సాగులో ఈ చెట్టుకు ఎనలేని ప్రాముఖ్యత లభిస్తోంది. ఈ వృక్షం విరివిగా లభిస్తుండటంతో కర్షకులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి.

- పంటల రక్షణలో ముఖ్య భూమిక
- వేప ఉత్పత్తుల్లో మెండుగా ఔషధ గుణాలు
- రైతులకు తగ్గుతున్న ఖర్చులు
- సాగులో వినియోగం పెరిగితే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

వేప నూనె





వేప విత్తనాలతో కషాయం చేస్తున్న దృశ్యం



వేపచెట్టు

గోస్పాడు: వేపచెట్టు.. అద్భుత ఔషధ గని. ఈ వృక్షంలోని ప్రతి భాగంలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అందువల్ల బహుముఖ ఔషధ చెట్టుగా గుర్తించబడింది. వేప ఉత్పత్తులు ఇటు మానవాళికి అటు వివిధ పంటల రక్షణకు దోహద మవుతున్నాయి. వేప ఉత్పత్తుల్ని సాగులో వాడితే సాగు ఖర్చు ఆదా అవుతూ, ఆశించినస్థాయిలో దిగుబడులు లభిస్తాయి.

కీటకాలు నాశనం..

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. దీనికి పలు రకాల కీటకాలు నల్లిజాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమతోడ్సు, కొన్ని రకాల బూజు శిలీంధ్రాల్ని అరికట్టే శక్తి ఉంటుంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటల్లో వచ్చే కీటకాల్ని అరికడుతుంది, మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయంతో పాటు వివిధ రకాల వేప ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఉత్పత్తులు.. పని చేసే విధానం..

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన మేరకు వాడితే కీటకాల పెరుగుదలను నిరోధిస్తుంది. దీన్ని పిచికారీ చేస్తే పురుగులకు వికారం కలిగించి పైరును తినకుండా చేస్తుంది. విష పూరిత అవశేషాలుండవు. ఇది పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి వాటికి హాని చేయదు. శీతాకోకచిలుకలు, తల్లి రెక్కల పురుగులు పెట్టిన గుడ్లు పొదగక ఎక్కువ శాతం చనిపోతాయి. సమగ్ర సస్యరక్షణ విధానంలో బాగా ఉపయుక్తమవుతుంది. పురుగు మందులు, శిలీంధ్ర నాశినులతో కలిపి సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు. వేప రసం ద్వారా పురుగులు పైరును తినడానికి, రసం పీల్చడానికి ఇష్టపడవు. పురుగుల ప్రత్యుత్పత్తి దశలపై ప్రభావం చూపి తదుపరి దశలు ఎదగకుండా చేస్తుంది. వేప చెక్క వాడకంతో నులిపురుగుల సమస్యను తగ్గించవచ్చు. వేపనూనెను పిచికారీ చేయడం వల్ల పురుగులపై ప్రభావం చూపి వివిధ దశలు ఎదగకుండా చేస్తుంది. వేపనూనె ఇతర పురుగు మందులతో కలిపి వాడుకున్నప్పుడు మరింత ప్రభావంతంగా పని చేస్తుంది.

ఇలా చేయాలి..

పైరును పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తర్వాత ఆరు గంటల వ్యవధిలోపు వర్షం పడితే మళ్లీ చేయాల్సిందే.

జాగ్రత్తలు...

- వేపనూనెను విడిగా పదేపదే వాడుకుంటే మొక్కల్లో ఎదుగుదల మందగిస్తుంది.
- మార్కెట్లో వేపనూనె మందులు వివిధ గాఢతలో లభిస్తాయి.అవి 300,1500,3వేలు, 10వేలు పీపీఎంలలో నాలుగు రకాలుగా లభిస్తాయి.
- గాఢతలను అనుసరించి తగిన మోతాదులో పంటలపై పిచికారీ చేసుకోవాలి.
- వేపకాయల కషాయాన్ని సంవత్సరం లోపే వాడుకోవాలి.

వేప చెట్లను సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చు



వేపలో నత్రజని అధికంగా ఉంటుంది. వేపగింజల నూనె, వేపచెక్క, వేపకాయలు దంచితే వేప పిండి తయారఅవుతుంది. వేప ఉత్పత్తులను వాడి పొలాల్లో నేలద్వారా వచ్చే తెగుళ్ల, చీడపీడలను నివారించుకోవడం ద్వారా రైతులు మంచి ఫలితాలు పొందవచ్చు. పంటకు అవసరమైన మేరకు మాత్రమే వేప ఉత్పత్తులను వాడుకోవాలి. సేకరించిన వేపకాయలు రైతులు ఒక సంవత్సరం లోపే వాడితే ప్రయోజనకరంగా ఉంటుంది. సేంద్రియ విధానానికి వేప ఎంతగానో ఉపయోగపడుతుంది.

– దేసుబాలరాజు, సస్యరక్షణ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, యాగంటిపల్లి

తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడల్ని నివారించుకోవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయటం వల్ల కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడ, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేయవచ్చు. ఐదు శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చి మీద వచ్చే జెమినీ వైరస్ తెగులు అదుపులో ఉంటుంది. వేరుశనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కాకుమచ్చ, టమాటోలో ఎండు తెగుళ్లను వేపనూనెతో నివారించవచ్చు.

ఫీజుల దోపిడీపై విచారణ చేపట్టాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీపై విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ శ్రీనివాసులుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, సురేష్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఫీజులను నిర్ణయించుకొని దోపిడీ చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. స్కూల్ బుక్స్, షూ, టై, బెల్ట్ యూనిఫాంలను పాఠశాలల్లోనే అమ్ముతూ వ్యాపార కేంద్రాలుగా మార్చారన్నారు. ఆయా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎర్రిస్వామి, సురేష్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి..

జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు రాజునాయుడు, ఓబులేసు, రియాజ్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేడుకగా ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకరణంలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలారూపంలోని శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రదోష కాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కోవెలకుంట్ల వసతిగృహంలో స్టోర్‌రూంను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: వసతి గృహాల్లో ఉంటూ వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల, బీసీ బాలుర, గుళ్లదూర్తి బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతి కల్పిస్తున్నారా, లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదుల్లోకి వెళ్లి కూరగాయలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. డీటీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, వార్డెన్లు వనజాక్షి, చైతన్యలక్ష్మి, ఎర్రమ్మ, వీఆర్‌ఓలు చెన్నయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామానికి చెందిన ఓ రైతు పొలాలకు వెళ్లే రస్తాను ఆక్రమించి గుంత తవ్వడంతో తాము పొలాలకు వెళ్లలేకపోతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు వెంకటరమణమ్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు జింక ప్రతాప్, లుక్కాని నరసింహుడు, దోని దానియేలు, ఎండపల్లి నాగన్న, తీట్ల దానమ్మ, దోని అబ్రహాం మాట్లాడుతూ.. సర్వే నంబరు 259లో కడప జిల్లా, పెద్ద ముడియం మండలం, సుద్దపల్లె గ్రామానికి చెందిన వనిపెంట హరినాథ్‌రెడ్డికి కొంత సొంత పొలం ఉంది. దీనికి సమీపంలో ఉన్న రస్తా నుంచి పెద్దబోదనం గ్రామానికి చెందిన 50 మంది రైతులు సుమారు 150 ఎకరాలకు పూర్వం నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం హరినాథ్‌రెడ్డి రస్తాను ఆక్రమించి సుమారు 6 అడుగుల మేర గుంత తవ్వి ఇటు వైపు రస్తా లేదని తమను అడ్డుకుంటున్నాడని వాపోయారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. కాగా.. గ్రీవెన్స్ కార్యక్రమానికి ఒక్క సమస్య మాత్రమే నమోదైంది. కార్యక్రమంలో ఎంపీడీఓ సుర్యనారాయణరెడ్డి, ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఏపీఓ నిర్మలా దేవి పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల పెన్షన్ రివిజన్ చేయాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల(వ్యవసాయం): సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డు ఉద్యోగుల పెన్షన్ రివిజన్ చేయాలని ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల ఏఐబీఎస్‌ఎన్‌ఎల్ పీడబ్ల్యూఏ సర్వసభ్య సమావేశం సోమవారం నిశాంతి భవన్‌లో అధ్యక్షుడు బీవీ రమణయ్య అధ్యక్షతన జరిగింది. నాయకులు మాట్లాడుతూ 2017 నుంచి ఉన్న పెన్షన్ రివిజన్ వెంటనే చేపట్టాలని కోరారు. దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అనంతరం కొత్త బ్రాంచ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ అధ్యక్షుడిగా బీవీ రమణయ్య, సెక్రెటరీగా దేవ ప్రసాద్, ట్రెజరర్‌గా నరసింహులు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు రామాదాసు, రామాంజనేయులు, ఎల్లయ్య, రమణయ్య, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

రుద్రవరం: అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి ఆగస్టు 31 వరకు అతిసార నివారణ సదస్సులు నిర్వహించాలని చెప్పారు. గ్రామాల్లో అతిసారం సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం మెరుగు, ఎప్పటికప్పుడు పైప్ లైన్ లీకేజీల మరమ్మతులు, ట్యాంకులు క్లోరినేషన్ వంటివి విధిగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు నిరంకుశ విధానాలను అవలంభిస్తూ దేశ రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసిందన్నారు. నల్లచట్టాలను తెచ్చి పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేకుండా చేసిందని మండిపడ్డారు. అనంతరం నంద్యాల మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా హుసేన్‌వలి, కో కన్వీనర్‌గా జయన్న, శ్రీనివాసగౌడ్‌తో పాటు 9మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు రఫీ, సాహిద్, మాబాషా, సుంకన్న, పరమేష్ పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం



ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుములదిన్నె గ్రామ సర్పంచ్ షేక్ మాబూషరీఫ్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ సంతకాలను ఫోర్జరీ చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొంకా మోహన్‌రావు ఉద్యోగం పొందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కొంకా మోహన్‌రావు 2023 సెప్టెంబర్ 16న ఫీల్డ్ అసిస్టెంటు దరఖాస్తుతో పాటు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల తీర్మాణ ధ్రువీకరణ పత్రంలో వారి సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఆ పత్రాలతో స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీఎంకు అందజేసి ఉద్యోగం పొందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్.. పంచాయతీ కార్యదర్శితో కలిసి సోమవారం ఉయ్యాలవాడలోని కార్యాలయానికి చేరుకుని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీఓ రవిప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ సమక్షంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని ఏపీఓ స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఆళ్లగడ్డ: పట్టణ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ భవనంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ (పీజీఆర్) కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి కార్యక్రమం ప్రారంభించిందని, ఇక నుంచి ప్రతి సోమవారం క్రమం తప్పకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. పట్టణ వాసులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే పరిశీలించి ఎప్పటి లోగా పరిష్కారం అవుతాయో తెలియజేస్తామన్నారు. ఏఈ సురేంద్ర పాల్గొన్నారు

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు వద్ద సోమవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా ఉన్న వైఎస్సార్ కడప జిల్లా, రాజుపాళెం మండలం, పగిడాల గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసులును తనిఖీ చేయగా.. అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని చెప్పారు.

శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామంలో హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శిలాఫలకాన్ని ఇటీవల దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. గ్రామ సర్పంచ్ బత్తుల విజయగౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఎన్నడో?

- విద్యార్థులకు తప్పని ఎదురు చూపులు
- ఇంతవరకు విడుదల కాని నోటిఫికేషన్
- గత ఏడాది ఈ పాటికే దరఖాస్తుల ప్రక్రియ



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఎప్పుడు విడుదలవుతుందా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో జూన్ 20వ తేదీ నాటికే నోటిఫికేషన్ విడుదల కాగా, ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా విడుదల కాని పరిస్థితి. గతేడాది ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించారు. ప్రస్తుతం ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలయ్యాయి. అనంతరం ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి ఈ నెల 18న ఫలితాలను కూడా విడుదల చేశారు. ఇప్పటికే ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు తదనంతరం ఉన్నత చదువులకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా డిగ్రీ చదవాలనుకునే వారు ప్రవేశాల ఆన్‌లైన్ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని నిరీక్షిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగానపల్లె, డోన్, బేతంచెర్ల, నందికొట్కూరు, ఆత్మకూరులో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,500 వరకు సీట్ల భర్తీకి అవకాశముంది. అలాగే 30 ప్రైవేట్, రెండు అటానమస్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు..

జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి గత విద్యా సంవత్సరం నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టింది. సంప్రదాయ మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అమలు చేస్తున్నారు. ఈ కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీలో ఏదో ఒక సబ్జెక్టును మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా చదువుకుంటాడు. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు. డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు అని సర్టిఫికెట్ ఇస్తారు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్ సరిఫిట్స్‌ను విద్యార్థికి అందజేస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసే వెసులు బాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు అందజేస్తారు. విద్యార్థి ఫస్టియర్ నుంచి నాలుగేళ్లలోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ : పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రఘురాం సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముండటంతో పారిశుద్ధ్యం, తాగునీరుపై శ్రద్ధ వహించాలన్నారు. మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి కుళాయిలకు నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. మురుగు కుంటల్లో దోమల నివారణకు వేస్ట్ ఆయిల్ చల్లించాలని చెప్పారు. ఈఓపీఆర్‌డీ మహీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు శాంతారాం భట్, ఆంజనేయ శర్మ, ముఖ్య అర్చకులు రాఘవ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్ళగడ్డ
99122 20581 (నంద్యాల)
70750 09103 (ఆళ్ళగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com